ప్రజాశక్తి
సోమవారం 30 అక్టోబర్ 2023
5
విజయనగరం

జిల్లా సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రైల్వే ప్రమాద క్షతగాత్రులను పరామర్శిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, నాయకులు

హాహాకారాలు.. ఆర్తనాదాలు

నుజ్జునుజ్జయిన రైలు బోగీలు

ఆదివారం రాత్రి 7.10 గంటల సమయం.. ఇంతలో ఒక్కసారిగా పెద్దశబ్దం.. ఆ రెండు రైళ్లలో ప్రయాణిస్తున్న వారంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. తేరుకుని చూసేసరికి బోగీలు నుజ్జునుజ్జయ్యాయి. కళ్లెదుట పదులకొద్దీ మంది గాయపడ్డారు. కాళ్లు చేతులు విరిగిపోయిన వారి హాహాకారాలు, ఆర్తనాదాలతో ఆ ప్రాంతం మార్మోగింది. అప్పటివరకూ తమతో కలిసి ప్రయాణించిన పలువురు విగతజీవులుగా మారడంతో ఆ ప్రాంతమంతా భీతావహ పరిస్థితి నెలకొంది. తీవ్ర విషాదం అలుముకుంది. రైళ్ల శబ్దం విని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. అధికారులకు సమాచారం తెలియడంతో హుటాహుటిన చేరుకొని క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, రైల్వే పోలీసులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువతి

ప్రజాశక్తి-విజయనగరంప్రతినిధి, జామి, లక్కవరపుకోట, కొత్తవలస, విజయనగరం కోట, టౌన్

కంటకాపల్లి రైల్వేస్టేషన్ దాటాక లక్కవరపుకోట మండలం భీమాళి సమీపాన ఆదివారం రాత్రి 7.10 గంటల సమయంలో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో 8 మంది మృతి చెందారు. మృతుల సంఖ్య 20పైనే ఉంటుందని స్థానికులు అంటున్నారు. సుమారు వందమంది వరకు గాయపడినట్లు తెలుస్తోంది. విశాఖ నుంచి పలాస వెళ్తున్న పాసింజర్ రైలు కంటకాపల్లి స్టేషన్ దాటిన తరువాత భీమాళి సమీపాన విద్యుత్ లైన్ సరఫరా లేక ఆగింది. అదే సమయంలో దాని వెనుకనే వస్తున్న విశాఖ-రాయగడ ప్యాసింజర్ కంటకాపల్లి స్టేషన్‌లో గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో స్పీడ్‌గా వెళ్తూ ముందున్న రైలును ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు రైళ్లకు చెందిన నాలుగు బోగీలు పట్టాలు తప్పడమే కాకుండా నుజ్జునుజ్జయ్యాయి. ఈ ఘటనలో రాయగడ పాసింజర్ రైలు డ్రైవర్‌తో పాటు 8 మంది మృతి చెందారు. రాత్రి 11 గంటల వరకు వారిని బయటకు తీశారు. మృతుల సంఖ్య 20 వరకు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

ఘటనా స్థలంలో సహాయక చర్యల్లో సిబ్బంది

38 మందికి చికిత్స

విజయనగరం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించిన 38 మంది క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ అనిలాసుందరి తెలిపారు. 50 మంది వైద్యులతో వీరికి వైద్య సేవలందిస్తున్నామని వెల్లడించారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో మరో మూడు అంబులెన్సుల్లో క్షతగాత్రులను ఆస్పత్రికి తీసుకొచ్చారు.

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి బొత్స

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన మంత్రి బొత్స

ప్రమాదం విషయం తెలిసిన వెంటనే విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్‌పి ఎం.దీపిక, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, శ్రీకాకుళం ఎంపి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఆర్‌డిఒ సూర్యకళ, ఎల్.కోట ఎంపిపి గేదెల శ్రీనివాసరావు, ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తదితరులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాద ఘటన గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. వెంటనే సహాయ చర్యలను ముమ్మరం చేశారు.

ఆగిన రైళ్లు.. ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు

రైలు ప్రమాదంతో అటు విశాఖపట్నం, ఇటు రాయగడ, భువనేశ్వర్‌వైపు వెళ్లే పలు రైళ్లు విజయనగరం రైల్వేస్టేషన్‌లో నిలిచిపోయాయి. సాయంత్రం 7.10 గంటలకు ఈ ఘటన జరగడంతో అప్పటినుంచి వచ్చిన రైళ్లన్నీ ఇక్కడ నిలిపివేయడం జరిగింది. సికింద్రాబాద్ వెళ్లే నాగావళి ఎక్స్‌ప్రెస్, గోట్నా రైల్వేస్టేషన్‌లో ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్, కోణార్క ఎక్స్‌ప్రెస్‌లను నిలిపివేశారు. ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్, చెన్నై వెళ్లే సంత్రాగంజ్, కోర్బా తదితర రైళ్లు నిలిచిపోయాయి. గోట్నా స్టేషన్‌లో సౌకర్యాలు లేకపోవడంతో ప్రయాణికులంతా రైలులో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రైళ్ల రాకపోకలు నిలిచిపోవడంతో విజయనగరం రైల్వేస్టేషన్ ఆవరణలో ప్రయాణికుల పడిగాపులు

ఘటనా స్థలంలో తల్లి, చిన్నారి రోదనలు

క్షతగాత్రులను సిపిఎం నాయకుల పరామర్శ

విజయనగరం జిల్లా కేంద్రాస్పత్రికి క్షతగాత్రులను అంబులెన్సుల్లో తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న బాధితులను సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, నాయకులు జి.శ్రీనివాస్ పరామర్శించారు. ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు చేరుకొని క్షతగాత్రులకు అవసరమైన రక్తం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు.

కోలగట్ల పరామర్శ

జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, వన్‌టౌన్ సిఐ బి.వెంకటరావు, తహశీల్దార్ కె.శ్రీనివాసరావు పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు కోలగట్ల సూచించారు.

వైభవోపేతం.. విజయనగర ఉత్సవం

సంస్కృతీ సంప్రదాయాలకు పుట్టినిల్లుగా భాసిల్లుతున్న విజయనగరంలో ఉత్సవ సంరంభం వైభవంగా ఆరంభమైంది. గ్రామీణ కళలు ఉట్టిపడే కళారూపాలతో శోభాయాత్ర... విజయనగర వైభవాన్ని చాటిచెప్పే శాస్త్రీయ సంగీతాలు... నృత్య కళారూపాలు... అలనాటి పరిస్థితులకు అద్దంపట్టే నాటక ప్రదర్శనలు... విజ్ఞానం విరజిల్లే వైజ్ఞానిక ప్రదర్శన... మేధకు పదునుపెట్టి, చక్కిలిగింతలు పెట్టే కవిసమ్మేళనం... ఇంకా ఎన్నో.. ఎన్నెన్నో విశేషాలు.. ఇవన్నీ తొలిరోజు విజయనగరం ఉత్సవాల్లో కనిపించిన దృశ్యాలు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ విజయనగరం ఉత్సవాలను పైడితల్లమ్మ ఆలయం వద్ద మంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభించారు.

ప్రజాశక్తి-విజయనగరం టౌన్, కోట

విజయనగరం ఉత్సవాలకు శ్రీకారం చుడుతూ నిర్వహించిన శోభాయాత్రను ఆదివారం మంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభించారు. పైడితల్లమ్మ ఆలయం నుంచి కోట, సింహాచలం మేడ మీదుగా గురజాడ కళాక్షేత్రం వరకు ఈ ర్యాలీ సాగింది. సుమారు 71 కళారూపాలు, అంశాలతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వివిధ ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పెద్ద ఎత్తున ప్రదర్శనలో పాల్గొన్నారు.

80 మంది కవులతో కవి సమ్మేళనం

లేడీస్ రిక్రియేషన్ క్లబ్‌లో 80 మంది కవులతో కవి సమ్మేళనం నిర్వహించారు. సంస్కృత కళాశాల ప్రిన్సిపల్ జనార్దనరావు , కవులు జక్కు రామకృష్ణ, చీకటి దివాకర్, మింది విజయ మోహనరావు, సూర్య లక్ష్మి, చంద్రిక, చివుకుల శ్రీలక్ష్మి, బాలకృష్ణ, తదితరుల ఆధ్వర్యంలో కవి సమ్మేళనం జరిగింది. అనంతరం కవులను ఘనంగా సన్మానించారు. అనంతరం 108 మంది సాహితీమూర్తుల విరచిత రచనా సమాఖ్య వారి గురు బ్రహ్మ పుస్తకాన్ని ఆవిష్కరించారు.

రేలారే రేలా బృందం ప్రదర్శన

కళాకారిణుల నృత్య ప్రదర్శన

విజ్ఞానం పెంపొందించేలా

కోటలో ఏర్పాటు చేసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శన విజ్ఞానాన్ని పెంపొందించేలా ఉంది. ఆంధ్రా

పడవ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

హోరెత్తించిన జానపద కళలు

లయన్స్ క్లబ్‌లో ప్రదర్శించిన జానపద కళలు హోరెత్తించాయి. పులివేషాలు, కర్ర సాము, డప్పు నృత్యం, నవ దుర్గల నృత్యాలు, రేలారే రేలా ఫోక్ ఆర్కెస్ట్రా, థింసా, గిరిజన నృత్యాలు అలరించాయి. అనంతరం కళాకారులను సన్మానించారు.

ప్రారంభించిన మంత్రి బొత్స

ఆకట్టుకున్న సాంస్కృతిక కళారూపాలు

యూనివర్సిటీ ఇన్నోవేషన్ డిపార్టుమెంటు అఫ్ డ్రోన్ టెక్నాలజీ, సీతం కళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పలు సాంకేతిక పరికరాలు విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి. ప్రభుత్వ ఐటిఐ విద్యార్థులు చెత్తతో తయారు చేసిన బొమ్మలను, చిన్న చిన్న వస్తువులను ప్రదర్శించారు.

ఆకట్టుకున్న నాటికలు, ఏకపాత్రలు

స్థానిక గురజాడ కళాక్షేత్రంలో ప్రదర్శించిన ఏకపాత్రాభినయాలు, సాంఘిక నాటకాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. వివిధ సామాజిక అంశాలపై స్థానిక నాటక సమాజాలు ప్రదర్శించిన అమ్మో బొమ్మ, రుణాలబంధం, ఒక రాక్షసుడి కథ, ఆఖరి ఉత్తరం, శిక్ష, పుటుక్కు జరజర డుబుక్కుమే నాటికలు ఆలోచింపజేశాయి. చాసో స్మారక భవనంలో ప్రదర్శించిన ఏకపాత్రలు అలరించాయి.

పోటాపోటీగా పడవ పోటీలు

స్థానిక అయ్యకోనేరులో క్రీడల శాఖ ద్వారా ఉత్తరాంధ్ర పడవల పోటీలు నిర్వహించారు. 5 జిల్లాలకు చెందిన 60 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. సాయంత్రం వరకు ఫైనల్స్ నిర్వహించారు. మెకానికల్ బోటు సెయిలింగ్‌లో ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల వారు కూడా పాల్గొన్నారు. రాజీవ్ క్రీడా ప్రాంగణంలో ఉత్తరాంధ్ర కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఆనందగజపతి ఆడిటోరియంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మహారాజా సంగీత కళాశాల ఆధ్వర్యంలో శాస్త్రీయ నృత్యాలు, శాస్త్రీయ సంగీతం, జానపద సంగీత కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు సుమారు 40 బృందాలు ప్రదర్శన ఇవ్వనున్నాయి. ఈ ప్రదర్శనలను మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి, జెసి మయూర్ అశోక్, ఎస్‌పి దీపిక వీక్షించారు. అనంతరం కళాకారులను సన్మానించి మెమోంటోలు అందజేశారు.

ర్యాలీలో పాల్గొన్న బొత్స, కోలగట్ల

పుష్ప ప్రదర్శన

ఆకర్షిస్తోన్న పుష్ప, ఫల ప్రదర్శన

మహారాజా సంగీత కళాశాలలో ఏర్పాటు చేసిన పుష్ప, ఫల ప్రదర్శనను మంత్రి బొత్స ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో ఫ్రెష్ ఫ్లవర్స్, డ్రై ఫ్లవర్స్, వెజిటబుల్ కార్వింగ్, సైకత శిల్పం, నర్సరీ తదితర మొక్కలను ప్రదర్శించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ పలువురిని ఆకర్షిస్తోంది. పూలు, మొక్కలతో తయారు చేసిన భారత దేశం మ్యాప్, పూల పుట్టగొడుగులు, కాఫీ మగ్ విత్ కప్, పూలతో చేసిన పలు రకాల పక్షులు, జంతువులు బార్బీ డాల్, వాటర్ ఫౌంటెయిన్.. పెద్దల్లో, పిల్లల్లో ఆనందాన్ని నింపుతున్నాయి.

కళాకారిణుల నృత్య ప్రదర్శన

కళల పరిరక్షణకు ఉత్సవాలు దోహదం

మన సంస్కృతీ సంప్రదాయం, కళల పరిరక్షణకు ఇటువంటి ఉత్సవాలు దోహదపడతాయని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. గురజాడ కళాక్షేత్రంలో జరిగిన విజయనగరం ఉత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పైడితల్లమ్మ పండగకు వచ్చే యాత్రికులకు ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు.

అందరూ సహకరించాలి

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ వివిధ కళల్లో నిష్ణాతులు, ప్రావీణ్యం ఉన్న వారి ప్రోద్బలంతో, పెద్దల ఆదేశాలకు అనుగుణంగా మన సంప్రదాయ కళలను ప్రోత్సహించేందుకు ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. వివిధ కళారూపాలతో, కళాకారులతో నగరానికి కొత్త శోభ వచ్చిందన్నారు. అత్యంత వైభవంగా మూడు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించేందుకు సంకల్పించామని, దీనికి అందరూ సంపూర్ణంగా సహకరించాలని కోరారు.

విజయనగర వైభవానికి ప్రతిబింబాలు

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ విజయనగరం ఉత్సవాలు మన వైభవానికి, సంస్కృతికి ప్రతిబింబాలన్నారు. ప్రజల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా, సంస్కృతి, కళలు, సంప్రదాయాల పరిరక్షణకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం సంపూర్ణ సహకారంతో ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని వెల్లడించారు.

ఇదొక గొప్ప అవకాశం

కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ మన కళలు, సంస్కృతి, సంప్రదాయాల ప్రదర్శనకు ఇదొక గొప్ప అవకాశమని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, అందరి భాగస్వామంతో ఉత్సవ కార్యక్రమాలను రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయ యాదవ్, ఎస్‌పి దీపిక, జెసి మయూర్ అశోక్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, వివిధ వేదికలు, కార్యక్రమాల ఇన్‌ఛార్జులు సుధాకరరావు, రాజ్ కుమార్, వి.టి.రామారావు పాల్గొన్నారు.

నేడు తొలేళ్ల ఉత్సవం

పట్టువస్త్రాలు సమర్పించనున్న రాజవంశీయులు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లమ్మ పండగలో ప్రధాన ఘట్టమైన తొలేళ్ల ఉత్సవం సోమవారం అర్ధరాత్రి జరగనుంది. ఉదయం నుంచి ప్రజలు ఘటాలతో అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకోనున్నారు. తొలేళ్ల ఉత్సవం సందర్భంగా ఆలయ దర్మకర్త అయిన పూసపాటి వంశీయులు పట్టు వస్త్రాలను అమ్మవారికి సమర్పించనున్నారు. తొలేళ్ల ఉత్సవం రోజున అమ్మవారిని దర్శించుకునేందుకు జిల్లా వ్యాప్తంగా అధిక సంఖ్యలో భక్తులు రానున్నారు. ఈ సందర్భంగా అర్ధరాత్రి అమ్మవారి చదురుగుడి నుంచి వేద పండితులు మంత్రోత్సవాల మధ్య ఘటాలు మూడు లాంతర్లు మీదుగా కోట వరకు వాయిద్యాలు, పులివేషాలు నడుమ చేరుకుంటాయి. అక్కడ అమ్మవారి పూజారి పండగ విశేషాలను యాత్రికులకు వివరించనున్నారు. అనంతరం వరి విత్తనాలను చల్లనున్నారు. రైతులు ఆ విత్తనాలు తీసుకునేందుకు పోటీ పడతారు. ఆ విత్తనాలు పొలంలో నాటితే మంచి పంటలు పండుతాయని రైతుల నమ్మకం. ఈ సందర్భంగా నగరంలో జనం మేలుకొని ఉండటంతో వారికి వినోదాన్ని అందించడం కోసం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అనవాయితీగా వస్తోంది. ప్రధానంగా యువత నగర వీధుల్లో సందడి చేయనున్నారు.

పైడితల్లమ్మ ఆలయం

అభివాదం చేస్తున్న టిడిపి, జనసేన నాయకులు

సమన్వయంతోనే ముందుకు..

టిడిపి, జనసేన నాయకులు వెంకన్న, తాతారావు

ప్రజాశక్తి-విజయనగరంకోట

రానున్న రోజుల్లో ఇకపై టిడిపి, జనసేన పార్టీ సమన్వయంతోనే ముందుకు వెళ్తాయని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు బుద్ధ వెంకన్న, జనసేన పిఎసి సభ్యులు కోన తాతారావు తెలిపారు. ఆదివారం స్థానిక విజయనగరంలో ఓ ప్రయివేట్ హోటల్లో టిడిపి, జనసేన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. విజయనగరంలో కంపెనీల రావని, పరిశ్రమలు వచ్చినట్లు పేపర్ల మీద ఉంటాయని చెప్పారు. బోగస్ కంపెనీల గురించి వాళ్లు ఈ రాష్ట్రానికి 14 ఏళ్ల మంత్రులుగా ఉన్నారని విమర్శించారు. విజయనగరంలో ఎవరు లేఅవుట్ వేసిన కమీషన్ తీసుకుంటూ, ఎక్కడ ఖాళీ స్థలాలున్నా కబ్జాలు చేసుకున్న వాళ్లు ఉపసభాపతులుగా పనిచేస్తున్నారని ఆరోపించారు. ఇటీవల వైసిపి దొంగ నాటకానికి తెరతీసిందన్నారు.

ఎన్నికలు 120 రోజులు ఉంటుండగా బిసిలు, దళితులు, మైనారిటీలపై ఎక్కడి నుంచి ప్రేమ పూనుకొచ్చిందని ప్రశ్నించారు. ఇకపై టిడిపి, జనసేన కార్యకర్తలపై ఎవరైనా దాడి చేస్తే మూకుమ్మడిగా ఎదుర్కోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ రాష్ట్ర భవిష్యత్తు కోసం కలిసి పనిచేయడమే ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఎన్నికల తర్వాత జగన్మోహన్ రెడ్డి చల్లపల్లి జైలుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్‌గజపతిరాజు, టిడిపి, జనసేన నాయకులు కిమిడి నాగార్జున, లోకం మాధవి, పడాల అరుణ, గుమ్మడి సంధ్యారాణి, గురాన అయ్యలు, ఐవిపి రాజు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రిబ్బన్ కట్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

పైడితల్లమ్మ పండగ సందర్భంగా స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో ఉత్తరాంధ్ర వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఆదివారం పోటీలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రారంభించారు. వాలీబాల్ పోటీల్లో విజయనగరం, భోగాపురం, ఎస్‌కె అకాడమీ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, శ్రీకాకుళం జట్లు పాల్గొన్నాయి. కబడ్డీలో ఉత్తరాంధ్ర నుంచి 12 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు లీగ్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. కార్యక్రమంలో వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.సూరిబాబు, కెవిఎన్ రాజు, రాష్ట్ర కార్యదర్శి భగవాన్ దాస్, కృష్ణంరాజు, నిర్వాహకులు కనకల కృష్ణ, కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వర్ కౌశిక్, కార్యదర్శి కాళ్ళ సూరిబాబు, కార్పొరేటర్లు ఎస్ఎస్‌వివి రాజేష్, కంటుబుక్త తవిటిరాజు, అల్లు చాణక్య, ఆశపు వేణు పాల్గొన్నారు.

ఖోఖో సంయుక్త విజేతలుగా ఎపి పోలీస్, విజయనగరం జట్లు

విజయనగరం టౌన్ : పైడితల్లమ్మ పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉత్తరాంధ్ర ఖోఖో పోటీల్లో ఎపి పోలీస్, విజయనగరం జిల్లా జట్లు సంయుక్త విజేతలుగా నిలిచాయి. విజేతలకు పోలీస్ శిక్షణ కళాశాల ప్రిన్సిపల్ ఆనంద్ బాబు, సెట్విజ్ సిఇఒ రాంగోపాల్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి గోపాల్, బొమ్మన రామారావు, బాలకృష్ణ, మల్లికార్జున్, శ్రీను, సత్యనారాయణ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న పిటిసి ప్రిన్సిపల్ ఆనంద్‌బాబు

ప్రజా రక్షణ భేరిని విజయవంతం చేయండి

ప్రజాశక్తి - భోగాపురం

వచ్చే నెల 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ప్రజా రక్షణ భేరి యాత్రను విజయవంతం చేయాలని సిపిఎం నాయకులు బచ్చల సూర్యనారాయణ అన్నారు. స్థానిక ముక్కాం కూడలి వద్ద ఆటో డ్రైవర్లతో కలిసి యాత్రకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 3న శ్రీకాకుళం జిల్లా మందసలో ప్రారంభమైన యాత్ర పూసపాటిరేగ మీదుగా అదేరోజు విజయనగరం చేరుకుంటుందన్నారు. ఈ నెల 15వ తేదీన విజయవాడ చేరుకుని అక్కడ ముగింపు సభ జరుగుతుందన్నారు. ఈ ముగింపు సభను ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ సంఘం నాయకులు మరాడ రవి, ఆనం రమణ, అప్పారావు, డ్రైవర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

బస్సు యాత్ర సమరభేరిగా భావించాలి

ప్రజాశక్తి - కొత్తవలస

వైసిపి సామాజిక సాధికార బస్సు యాత్రను రాబోయే ఎన్నికలకు సమర బేరిగా భావించాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆదివారం వేపాడ, కొత్తవలస మండలాలకు చెందిన క్యాడర్‌తో నవంబర్ 4న నియోజకవర్గంలో జరగబోయే సామాజిక సాధికార బస్సు యాత్రకు సంబంధించి చేయవలసిన ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, వేపాడ, కొత్తవలస ఎంపిపిలు దొగ్గ సత్యవంతుడు, నీలం శెట్టి గోపమ్మ, ఎఎంసి చైర్‌పర్సన్ నూకల కస్తూరి, నాయకులు బొంతల వెంకటరావు, రాష్ట్ర డైరెక్టర్ దమ్ము రమణ, కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ యర్రయ్య రామస్వామి, వేపాడ వైసిపి మండల అధ్యక్షుడు ఓమ్మలూరు జగన్నాథం, మేలాస్త్రీ అప్పారావు, పిఎస్ఎన్ పాత్రుడు, రెండు మండలాల సర్పంచులు, ఎంపిటిసిలు, సచివాలయ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

8న తెర్లాంలో జగనన్నకు చెబుదాం

ప్రజాశక్తి - తెర్లాం

నవంబరు 8న స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని ఎంపిడిఒ ఎస్.రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి హాజరవుతారని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

లీకులతో తాగునీరు వృథా

ప్రజాశక్తి - బొబ్బిలి

పట్టణంలోని బిఎల్ఎన్ఎల్ కార్యాలయం వద్ద పైపులైన్ లీకులతో తాగునీరు వృథాగా పోతుంది. లీకులతో తాగునీరు వృథాగా పోవడంతో రోడ్డుపై తాగునీరు ప్రవహిస్తుంది. లీకులు వల్ల సంపూర్ణంగా తాగునీరు అందడం లేదని ప్రజలు వాపోతున్నారు. పైపులైన్ లీకులను నివారించి తాగునీరు సంపూర్ణంగా సరఫరా చేయాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

పైడితల్లమ్మ పండుగకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - శృంగవరపుకోట

ఎస్‌కోట డిపో నుంచి విజయనగరం పైడితల్లమ్మ పండుగను పురస్కరించుకొని భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు స్థానిక డిపో మేనేజర్ కె. రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రత్యేక బస్సులు ఆదివారం నుంచి అందుబాటులో ఉన్నాయన్నారు. ఎస్. కోట నుండి జామి మీదుగా విజయనగరం, ధర్మవరం మీదుగా విజయనగరం, కొత్తవలస మీదుగా విజయనగరానికి భక్తుల రద్దీని బట్టి ఏర్పాటు చేశామన్నారు. ఎస్. కోట నుండి విశాఖ వెళ్ళు ప్రయాణికుల కోసం సోమవారం ఉదయం 4గంటలకు కొత్తగా ఒక అల్ట్రా డీలక్స్ బస్సును, అలాగే విశాఖ నుండి ఎస్. కోట మీదుగా అరకునకు కూడా ఉదయం 4.45 గంటలకు ఒక అల్ట్రా డీలక్స్ బస్సును సోమవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ సదవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

సామాజిక బస్సుయాత్రతో మరోసారి మాయ

ప్రజాశక్తి - వేపాడ

రాష్ట్రంలో సామాజిక బస్సు యాత్రతో వైసిపి నాయకులు మరోసారి ప్రజలను మాయ చేసే ప్రయత్నం చేస్తున్నారని ఈ యాత్రలను ప్రజలు నమ్మడం లేదని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ అన్నారు. తన స్వగ్రామంలో ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ బస్సు యాత్ర చేస్తూనే మరోవైపు నెల్లూరులో బస్సు డ్రైవర్‌పై వైసిపి గుండాలు దాడి చేయడం సిగ్గుచేటన్నారు. ఈ రాష్ట్రంలో సామాన్యులకు స్వేచ్ఛగా బ్రతికే హక్కు లేదా అని ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వ విధానాలను చూస్తుంటే జగన్మోహన్ రెడ్డికి రాజ్యాంగం అన్న, న్యాయస్థానాల అన్నా గౌరవం లేదన్నారు. ప్రతి పక్ష నాయకులు ప్రజా సమస్యలపై ర్యాలీలు చేస్తే పోలీసులను ప్రయోగించి గృహ నిర్బంధాలు చేస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని రానున్న ఎన్నికల్లో కచ్చితంగా జగన్మోహన్‌రెడ్డిని ప్రజలు ఓడిస్తారని అన్నారు.

ఆర్‌డిఒ శేషశైలజకు సన్మానం

ప్రజాశక్తి - బొబ్బిలి

బొబ్బిలి ఆర్‌డిఒగా పని చేసి విశాఖ బదిలీ అయిన పి.శేషశైలజను రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్‌డిఒ కార్యాలయంలో సన్మానించారు. నూతన ఆర్‌డిఒగా బాధ్యతలు స్వీకరించిన సాయిశ్రీకు స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా శేషశైలజ మాట్లాడుతూ బొబ్బిలిలో పని చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారం బాగుందని చెప్పారు. నూతన ఆర్‌డిఒ సాయిశ్రీ మాట్లాడుతూ ప్రజలకు రెవెన్యూ సేవలు అందుబాటులో ఉంచుతామని చెప్పారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జెసి రాజు, వి.శ్రీహరి, కోశాధికారి శ్రీనివాస్, పాల్గొన్నారు.

ఆర్‌డిఒను సత్కరిస్తున్న జెసి రాజు

అందరి సహకారంతో జాతర

- ప్రశాంతంగా దర్శనాలకు చర్యలు
- 'ప్రజాశక్తి'తో పైడితల్లమ్మ దేవస్థానం సహాయ కమిషనర్ కె.ఎల్.సుధారాణి ముఖాముఖి

సోమ, మంగళవారాల్లో జరిగే పైడితల్లమ్మ జాతరను అందరి సహకారంతో విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని పైడితల్లమ్మ దేవస్థానం సహాయ కమిషనర్ కె.ఎల్.సుధారాణి తెలిపారు. దేవాదాయ శాఖ తరపున దిగ్విజయంగా పండగ నిర్వహించేందుకు ఇప్పటికే అన్ని రకాల చర్యలూ తీసుకున్నామని చెప్పారు. పండగకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులకు ప్రశాంతంగా అమ్మవారి దర్శనం జరిగేలా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి అనేక సమావేశాలు ఏర్పాటు చేసి, పండగను విజయవంతం చేసేందుకు పలు సూచనలు చేశారని వివరించారు. పైడితల్లమ్మ జాతర నేపథ్యంలో 'ప్రజాశక్తి'కి ఆమె ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు..

- ప్రజాశక్తి, విజయనగరంటౌన్

పైడితల్లమ్మ పండగకు ఈ ఏడాది ఎలా ఏర్పాట్లు చేస్తున్నారు.? యాత్రికులు ఎంతమంది వచ్చే అవకాశముంది.?

ఏటా ఏటా మాదిరిగానే ఈ ఏడాది అమ్మవారి పండగ తొలేళ్ల ఉత్సవం, సిరిమాను సంబరాలు విజయవంతంగా జరిపేందుకు అన్ని రకాల చర్యలూ తీసుకున్నాం. ఈ ఏడాది మూడు లక్షల దాటి యాత్రికులు నగరానికి వచ్చే అవకాశమున్నందున వారికి అమ్మవారి దర్శనం బాగా జరిగేందుకు కావాల్సిన ఏర్పాట్లు చేశాం.

దర్శనానికి ఎన్ని క్యూలైన్లు ఏర్పాటు చేశారు.? దర్శనాలు ప్రశాంతంగా జరిగే విధంగా తీసుకున్న చర్యలేమిటి.?

అమ్మవారి దర్శనం కోసం లక్షల సంఖ్యలో యాత్రికులు రానుండటంతో దర్శనాలు ప్రశాంతంగా జరిగే విధంగా రెండు ప్రాంతాల్లో క్యూలైన్లు ఏర్పాటు చేశాం. అమ్మవారి గుడి నుంచి మూడు లాంతర్లు వైపు రెండు, అమ్మవారి గుడి నుంచి ఎంజిరోడ్డు వైపు రెండు క్యూలైన్లు ఏర్పాటు చేశాం. క్యూలైన్లలో ఉన్న భక్తులకు ఎండకు గురి కాకుండా చలువ పందిరిలు ఇప్పటికే ఏర్పాటు చేశాం.

క్యూలైన్లలో యాత్రికులకు గంటలు కొద్ది ఉండాల్సి వస్తుంది. వారికి ఏమైనా సౌకర్యాలు కల్పించే అవకాశముందా.?

క్యూలైన్లలో ఉన్న యాత్రికులకు ఇబ్బంది కలగకుండా మజ్జిగ, తాగునీరు, చిన్న పిల్లలకు బిస్కెట్ ప్యాకెట్లు అందిస్తాం. వీటిని సరఫరా చేసేందుకు కొన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చాయి. వాటికి ఆ బాధ్యతలు అప్పగించాం.

దర్శనం కోసం ప్రత్యేక పాసులు,టోకన్లు ఏర్పాటు చేశారా.?

అమ్మవారి దర్శనం కోసం ఉచిత క్యూలైను ఒకటి ఉంటుంది. రెండవ క్యూలైన్లో రూ.50 టిక్కెట్ తీసుకున్న వారి దర్శనానికి లైన్ ఉంటుంది. ప్రత్యేకంగా రూ.300 దర్శనం టిక్కెట్ సోమవారం ఉదయం 11 గంటల నుంచి మంగళవారం ఉదయం 6గంటల లోపు ఉంటుంది. రూ.300 టిక్కెట్లు బ్యాంకుల్లో అందుబాటులో ఉంచాం.

పండగకు ఎంత మంది సిబ్బందిని వినియోగిస్తున్నారు.?

పండగకు లక్షల సంఖ్యలో యాత్రికులు రానుండటంతో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి దేవాదయశాఖ నుంచి 150 మంది సిబ్బందిని వినియోగిస్తున్నాం. వీరికి మూడు షిఫ్టుల్లో బాధ్యతలు అప్పగించాం. ఉత్సవాలకు ప్రత్యేకాధికారిగా రీజనల్ దేవాదయశాఖ కమిషనర్, రాజమండ్రికి చెందిన ఎంవి.సురేష్‌కుమార్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఇప్పటికే ఆయన పలు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు.

పండగకు నిధులు ఎంత కేటాయించారు.?

రాష్ట్ర పండగగా ప్రభుత్వం గుర్తించినప్పటికీ ఆర్థికంగా ఎటువంటి నిధులూ మంజూరు చేయలేదు. దేవాదయశాఖ మంత్రి పండగ రోజు వచ్చి పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. పండగకు దేవస్థానం నిధులు రూ.15 లక్షలు కేటాయించాం. ఈ డబ్బులతో పండగకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నాం.

ముఖాముఖి

సిరిమాను సంబరం సమయానికి జరిగే విధంగా తీసుకున్న జాగ్రత్తలు, చర్యలేమిటి.?

సిరిమాను మధ్యాహ్నం 3.30గంటలకు ప్రారంభమయ్యే విధంగా చర్యలు తీసుకున్నాం. దీని కోసం పోలీసు, అటవిశాఖ, ఆర్‌డిఒలతో సమన్వయం చేసుకున్నాం. చీకటి పడక ముందే సకాలంలో సిరిమాను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఉదయం 11గంటలకే హుకుంపేట నుంచి సిరిమాను అమ్మవారి గుడి వద్దకు తీసుకొచ్చే విధంగా నిర్ణయించాం. ఆలయం వద్దకు 1గంటల లోపు సిరిమాను చేరుకుంటే సిరిమాను బండికి కట్టేందుకు రెండు గంటలు సమయం పడుతుంది. దీంతో సరిగ్గా 3.30 గంటలకు సిరిమాను తిరిగే విధంగా చర్యలు తీసుకున్నాం. మంత్రులు, కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు చేపట్టి సిబ్బందికి ఆదేశాలు ఇచ్చాం.

పండగ నేపథ్యంలో ప్రసాదాలు ఎన్ని సిద్ధం చేస్తున్నారు.? వాటి ధరను ఏవిధంగా నిర్ణయించారు.?

పండగ నేపథ్యంలో 10వేల లడ్డూలు, పులిహోర ప్యాకెట్లు సిద్ధం చేసి ఉంచాం. అప్పటికప్పుడు ప్రసాదాలు విక్రయాలు జరుగుతున్న పరిస్థితిని బట్టి అందించేందుకు తగిన ఏర్పాట్లు చేశాం. ప్రసాదాలు తీసుకున్న వారందరికి అందే విధంగా సిద్ధం చేసి ఉంచుతున్నాం. లడ్డూ రూ. 15లు, పులిహోర రూ.10లుగా ధరను నిర్ణయించాం.

పరిహార(స)ం

- రైతుకు అందని నష్టపరిహారం
- రూ.20.50 లక్షలు మంజూరు
- నిధులు ఏమయ్యాయో?

ప్రజాశక్తి - గుర్ల

రబీలో పంట నష్టపోయిన రైతులను అధికారులు గతంలో గుర్తించారు. వారి జాబితాను ప్రభుత్వానికి నివేదించారు. దీంతో ప్రభుత్వం వారికి నష్టపరిహారం ఇచ్చేందుకు అంగీకరిస్తూ నిధులు మంజూరు చేసింది. అయితే ప్రభుత్వం నుంచి విడుదలైన జాబితాను మాత్రం అధికారులు ఎక్కడా బయటపెట్టలేదు. ప్రభుత్వం ఏ ప్రాతిపదికన నష్టపరిహారం మంజూరు చేసిందో వివరించే జాబితాను విడుదల చేయకపోవడం వెనుక మతలబు ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. పైగా పంట నష్ట పరిహారం విడుదలైనప్పటికీ రైతుల ఖాతాల్లో జమ కాకపోవడంతో ఆ డబ్బులు ఏమయ్యాయని ప్రశ్నిస్తున్నారు. కాగా నష్టపరిహారానికి సంబంధించిన రైతుల జాబితా తమకు రాలేదని అధికారులు చెప్పడం కొసమెరుపు.

మండలంలో గడిచిన రబీ సాగు మొక్కజొన్న పంట వర్షాలు కారణంగా రైతులు నష్టపోయారు. దీంతో అధికారులు పంట నష్టంను అంచనా వేసి పై అధికారులకు నివేదికలు పంపించారు. చేతికి అందిన పంటను నష్టపోవడంతో రైతులు అప్పుల పాలైనామని క్షేత్రస్థాయిలోకి వచ్చిన అధికారులు ముందు వాపోయారు. మండలంలో 164 ఎకరాలలో పంట నష్టం జరిగినట్లు నివేదికలు తయారు చేసి పై అధికారులకు పంపించారు. దీంతో తమకు పంట నష్టంను ప్రభుత్వం అందిస్తుందని రైతులు ఎంతగానో ఆశపడ్డారు. మండలంలో 696 మంది రైతులకు పంట నష్టం కింద రూ.20.50లక్షలు మంజూరైనట్లు మండల వ్యవసాయ అధికారి తెలిపారు. రైతులకు పంట నష్టం జరగడం, ప్రభుత్వం నష్టపరిహారం కింద నిధులు మంజూరు చేయడం జరిగిందని అధికారులే చెబుతున్నారు. కానీ నేటికి ఆ రైతులకు మాత్రం పరిహారం అందలేదు. దీనిపై జిల్లా స్థాయి అధికారులు కలుగ చేసుకొని రైతులకు పంట నష్టం పరిహారాన్ని అందచేయాలని రైతులు కోరుతున్నారు.

పంటనష్టాన్ని అంచనా వేస్తున్న సచివాలయ ఉద్యోగి(ఫైల్)

నేటి నుంచి దుర్గాలమ్మ మహోత్సవాలు

ప్రజాశక్తి - దెంకాడ

మండలంలోని కొండరాజుపేటలో సోమవారం నుంచి మూడు రోజులపాటు దుర్గాలమ్మ మహోత్సవాలను నిర్వహించనున్నట్లు సర్పంచ్ సరిగడ కళ్యాణి, మాజీ సర్పంచ్ సరిగడం బంగారు రెడ్డి, గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. మొదటి రోజు సోమవారం తొలెళ్ల ఉత్సవం రెండవ రోజు మంగళవారం పసుపు కుంకుమల సమర్పణ, మూడ వరోజు అనుపోత్సవం ఉంటుందని చెప్పారు. ఈ మూడు రోజులు పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. గ్రామంలో ఈ పండగ మూడు సంవత్సరాలకు ఒకసారి నిర్వహిస్తున్నామన్నారు. అయితే గుడిని కొత్తగా నిర్మించడంతో ఈసారి నాలుగేళ్లకు నిర్వహిస్తున్నామని చెప్పారు. సుమారు 30 నుంచి 50 వేల మంది పండగకు వస్తారని అంచనా వేశారు. చిత్ర విచిత్రమైన నేలవేశాలు, సాము గరిడీలతో పలు కార్యక్రమాలు, భారీ లైటింగ్‌తో ఈ పండుగ నిర్వహిస్తామన్నారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏలూరుకు చెందిన వారు అమ్మవారి వేషాలు, అఘోర డాన్సులు, బిందుల డాన్సులు, డప్పు వేషాలు, తీన్మార్ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అదే రోజు రాత్రి బాలు రైడర్స్ డాన్స్ బేబీ డాన్స్ కార్యక్రమం చేపడతామన్నారు. ముగింపు రోజు బుధవారం రాత్రి అనిల్ ఈవెంట్స్ డాన్స్ బేబీ డాన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ పండగకు ప్రతి ఒక్కరూ హాజరై మొక్కులు తీర్చుకోవాలని కోరారు.

ముస్తాబవుతున్న ఆలయం

చలో విజయవాడను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - వంగర

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, కర్షక వ్యతిరేక విధానాల నిరసిస్తూ నవంబర్ 27,28 తేదీల్లో జరగనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ రామ్మూర్తి నాయుడు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో రూపవతి అధ్యక్షతన ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మూర్తి నాయుడు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక కర్షక వ్యతిరేక విధానాలను వేగంగా అమలు చేస్తున్నాయని దీని వల్ల కార్మికులు కర్షక వర్గం తీవ్రంగా నష్టపోతుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లో కోటి మంది కార్మికులు అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్నా వాళ్లకు ఎటువంటి కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, పిఎఫ్, ఇఎస్ఐ గ్రాడ్యుటి పెన్షన్ వంటి సౌకర్యాలు కూడా కల్పించకుండా గౌరవ వేతనం పేరుతో వెట్టి చాకిరి చేయించుకుంటున్నారన్నారు. తక్షణమే కార్మిక కర్షక వ్యతిరేక విధానాల్ని ఆపాలని కార్మిక వర్గానికి ఉపయోగపడే విధానాల్ని అమలు చేయాలని కోరుతూ నవంబర్ 27 28 తేదీల్లో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్ర రాజధానిలో కూడా రెండు రోజులు పాటు మహా పడవ్ కార్యక్రమాలు నిర్వహించి కార్మిక కర్షక వ్యతిరేకతను తెలియజేస్తామన్నారు. ఈ సదస్సులో రూపవతి, తులసి, జయలక్ష్మి, కృష్ణమూర్తి, జయమ్మ, సత్యవతి, లక్ష్మీ, సరళ తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ ప్రారంభం

కొత్తవలస: మండలంలోని మేజర్ పంచాయతీ పరిధి పాత సుంకరపాలెం గ్రామంలో సిద్ధి వినాయక యువజన సంఘం ఆధ్వర్యంలో రూ.25లక్షలతో బంగారమ్మ తల్లి గుడికి నిర్మించిన ప్రహరీని ఆదివారం ప్రారంభించారు. ఆ సంఘ అధ్యక్షులు బెహరా హరిబాబు ఆధ్వర్యంలో కమిటీ పెద్దలు పెదిరెడ్ల సూరిబాబు (ప్రెస్), బెహరా విష్ణు, పెదిరెడ్ల కనకరావాలు, గౌరవాధ్యక్షులు బెహరా నాగేశ్వరరావు, లెంక ఈశ్వరరావు, బెహరా పరమేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు, సంఘ సభ్యుల ఆర్థిక సహాయ సహకారాలతో ఈ ప్రహరీ నిర్మాణం పూర్తయినట్లు అధ్యక్షులు హరిబాబు తెలిపారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ పెనగంటి మంగ వేణి, చెల్లయ్య పాల్గొని ప్రహరీ నిర్మాణం నిమిత్తం రూ.20వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

సారిపల్లి యువకుడికి స్కూల్ ఆఫ్ సైన్స్‌లో పిహెచ్‌డి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని సారిపల్లి గ్రామానికి చెందిన సారిపల్లి తిరుమల సంతోష్ కుమార్ డాక్టరేట్ (పిహెచ్‌డి) సాధించారు. సంతోష్ కుమార్‌కు విశాఖపట్నం గీతం యూనివర్సిటీ డిపార్ట్మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ, స్కూల్ ఆఫ్ సైన్స్‌లో పిహెచ్‌డి అవార్డు ప్రదానం చేస్తున్నట్లు తాజాగా ప్రకటించింది. సింథసిస్ ఆఫ్ కెమిస్ట్రీలో థీసిస్ చేసినందుకు సంతోష్ కుమార్ ఈ పిహెచ్‌డి డిగ్రీ సాధించారు. సంతోష్ తండ్రి సారిపల్లి నాగరాజు పోలీసు డిపార్ట్మెంట్‌లో ఎఎస్ఐగా పనిచేస్తున్నారు. తల్లి అమ్మాజీ గృహిణి. డాక్టరేట్ సాధించిన సంతోష్ కుమార్‌ను గ్రామస్తులు, స్నేహితులు, బంధువులు అభినందించారు.

సంతోష్‌కుమార్

డ్రైవర్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి

విజయనగరంకోట : కావలి వద్ద ఆర్‌టిసి డ్రైవర్‌పై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.రాములు డిమాండ్ చేశారు. విజయనగరం డిపో దగ్గర ఎస్‌డబ్ల్యుఎఫ్ డిపో అధ్యక్షులు చోడవరపు వెంకట్రావు ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు, కండక్టర్లపై ఇటీవల కాలంలో దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తంచేశారు. వాటిని అరికట్టాలని డిమాండ్‌చేశారు. అనంతరం కార్యక్రమంలో డిపో ప్రధాన కార్యదర్శి ఎ.చంద్రయ్య, సిఐటియు నాయకులు ఎ.జగన్మోహనరావు మాట్లాడారు. హైర్‌బస్ యూనియన్ నాయకులు మధు, వాసు, జెఎస్ఎన్ రాజు పాల్గొని మద్దతు తెలియజేశారు. ఎస్ డబ్ల్యు ఎఫ్ డిపో కమిటీ సభ్యులు మరియు ట్రాఫిక్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఆర్‌టిసి ఉద్యోగులు

ఎపిజిపిఎస్ఇఎ జిల్లా కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

ఎపి జిపిఎస్ఇఎ (సిపిఎస్ఇఎ) జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం స్థానిక శ్రీనివాస్ జూనియర్ కళాశాలలో జరిగింది. జిల్లా అధ్యక్షులుగా సింగారపు ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా మొయ్యి శ్రీరామ్, మహిళా అధ్యక్షులుగా సుంకర మంగమ్మ, ఆర్థిక కార్యదర్శిగా సైలాడ అప్పల నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు పాల్గొన్నారు.

అద్దె కొంపలోనే అంగన్‌వాడీ

వేపాడ : మండలంలోని వల్లంపూడి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం ఇంకా అద్దె కొంపలోనే కొనసాగుతోంది. అంగనవాడీ కేంద్రాలను బలోపేతం చేస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితి ఎక్కడా కానరావడం లేదు. దీంతో అద్దె కొంపల్లో ఇరుకు గదుల్లో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. వారు కనీసం ఆడుకునేందుకు కూడా స్థలం లేకపోవడంతో తంటాలు పడుతున్నట్లు పిల్లల తల్లిదండ్రులు చెబుతున్నారు. లక్షలు వెచ్చించి పాత భవనాలకు రంగులు వేస్తున్నారే తప్ప అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి మాత్రం నిధులు మంజూరు చేయడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అద్దె కొంపలో ఉన్న అంగన్‌వాడీ భవనానికి స్వస్తి పలికి శాశ్వత భవనం నిర్మించాలని కోరుతున్నారు.

వల్లంపూడిలో అద్దె అంగన్‌వాడీ భవనం ఇదే..

నేరాలు ఘోరాలు

అక్రమ గ్రావెల్ పట్టివేత

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

మండలంలోని కాసింధోరవలస పంచాయతీ పరిధిలో దొంగురువలస నుండి అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్‌ను ఆదివారం ఆర్ఐ కె.కళ్యాణ్ చక్రవర్తి పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి అనుమతులూ లేకుండా అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు, ఒక టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని తహశీల్దార్ కార్యాలయానికి తరలించామన్నారు. వాహన చోదకులు అనుమతులు ఉన్నాయని, జగనన్న లే అవుట్‌కు తీసుకువెళుతున్నామని తెలిపినట్లు ఆయన వెల్లడించారు. అనుమతి పత్రాలు తీసుకు వచ్చి పరిశీలన అనంతరం వాహనాలు తీసికు వెళ్లాలని వాహన చోదకులు తెలిపినట్లు ఆయన చెప్పారు.

రౌడీ షీటర్ అరెస్ట్

ప్రజాశక్తి - భోగాపురం

ఇటీవలి పెదకొండ్రాజుపాలెం ప్రభుత్వ మద్యం షాప్ వద్ద జరిగిన కొట్లాటలో విశాఖకు చెందిన రౌడీ షీటర్ చుట్టూరి హేవంత్ అలియాస్ మూతుడును ఎట్టకేలకు పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. ఆ గ్రామంలో పండుగ సందర్భంగా మద్యం షాపు వద్ద జరిగిన కొట్లాటలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలై కోమాలోకి వెళ్లి పోయారు. ఈ కేసులో రౌడీ షీటర్ హేవంత్ కూడా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. విశాఖలో హేవంతపై రెండు మర్డర్ కేసులు, ఒక గంజాయి, దొంగతనం కేసులుండటంతో రౌడీ షీటర్ ఓపెన్ చేసినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. హేవంత్‌ను అదుపులో తీసుకొని రిమాండ్ తరలించినట్టు పోలీసులు తెలిపారు.

NO.3. Order 5 RULE 3
SUMMONS TO APPEAR IN PERSON
IN THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL JUDGE AT GAJAPATHINAGARAM
I.A. 115/2023 in O.S. 47/2023

Between
Gedda @Edidala Sukanya. ...Petitioner/Plaintiff.
And:
Burli Rama Ratnam & two others.
......Respondents/Defendants.

To,
1. Burli Rama Ratnam, w/o late Ganaraju Appala Narasimha Raju, aged about 62 years, Hindu, Teacher, r/o Door No. 3-164, Mamidibanda colony, Puritipenta village, Gajapathinagaram mandal, Vizianagaram District.
2. Ganaraju Manoj Kumar Varma, s/o late Appala Narasimha Raju, aged about 32 years, Hindu, private employee, Rest ditto.
3. Ganaraju Vasavi Priya, d/o late Appala Narasimha Raju, aged about 35 years, Hindu, private employee, Rest d

Whereas the plaintiff has instituted this petition for attachment of the amount of Rs. 2,50,000/- in account belongs to Ganaraju Appala Narasimha Raju, baring account No. 11620296558, you are hereby summoned to appear in this court in person on **08th day of November 2023 at 10-30 (a.m.)** hours to answer the claim, and further you hereby directed to file within 30 days of service of summon a counter of your defense and you are directed to produce on that day all documents upon which you intend to rely in supporting of your defense. Take notice that in default of your appearance on the day before men- tioned, the suit will be heard and determined in your absence.

Reddy. Srinivasa Naidu,
Advocate,
Gajapthinagaram.
Gajapathinagaram,
Date: 27-11-2023.

NO.3. Order 5 RULE 3
SUMMONS TO APPEAR IN PERSON
IN THE HONOURABLE COURT OF THE JUNIOUR CIVIL JUDGE AT GAJAPATHINAGARAM
O.S. 47/2023

Between
Gedda @ Edidala Sukanya. ....Plaintiff.
And:
Burli Rama Ratnam & two others
.....Defendants.

To,
1. Burli Rama Ratnam, w/o late Ganaraju Appala Narasimha Raju, aged about 62 years, Hindu, Teacher, r/o Door No.3-164, Mamidibanda colony, Puritipenta village, Gajapathinagaram mandal, Vizianagaram District.
2. Ganaraju Manoj Kumar Varma, s/o late Appala Narasimha Raju, aged about 32 years, Hindu, private employee, Rest ditto.
3. Ganaraju Vasavi Priya, d/o late Appala Narasimha Raju, aged about 35 years, Hindu, private employee, Rest d

Whereas the plaintiff has instituted a suit against you, you are hereby summoned to appear in this court in person on **08th day of November 2023 at 10-30 (a.m.)** hours to answer the claim, and further you hereby directed to file within 30 days of service of summon a written statement of your defense and you are directed to produce on that day all documents upon which you intend to rely in supporting of your defense.

Take notice that in default of your appearance on the day before men- tioned, the suit will be heard and determined in your absence.

Reddy. Srinivasa Naidu,
Advocate,
Gajapthinagaram.
Gajapathinagaram,
Date: 27-11-2023.

కళ్లకు గంతలు కట్టి టిడిపి నిరసన

ప్రజాశక్తి - బొబ్బిలి

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా కోటలో టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన, కార్యకర్తలు కళ్లకు గంతలు కట్టుకుని ఆదివారం రాత్రి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బేబినాయన మాట్లాడుతూ రాజకీయ కక్షతోనే చంద్రబాబును అన్యాయంగా అరెస్టు చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎం.తిరుపతిరావు ఉన్నారు.

బొబ్బిలి: కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న బేబినాయన

వేపాడ : మండంలోని బానాదిలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ పిలుపు మేరకు టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు ఆధ్వర్యంలో కళ్లు తెరిపిద్దాం కార్యక్రమాన్ని కళ్లకు గంతలు కట్టుకుని చేపట్టారు. ఈ కార్యక్రమంలో బానాది ఎంపిటిసి గొంప తులసి, నాయకులు కండిపల్లి రమేష్, గొంప రామకృష్ణ, కండిపల్లి ఎర్రినాయుడు, కండిపల్లి అప్పలనాయుడు, కండిపల్లి రామారావు, గుమ్మడి రాంబాబు, కండిపల్లి ముత్యాల నాయుడు, కొట్యాడ వెంకటరావు, చాలుమూరి శ్రీరామ్, గుమ్మడి సత్యం, గొంప కోటేశ్వరరావు, గొంప శ్రీరామ్, కండిపల్లి ఈశ్వరరావు, కండిపల్లి రామారావు, సోమిరెడ్డి సతీష్, గుమ్మడి రాము తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: చంద్రబాబు అరెస్ట్‌ను నిరసిస్తూ స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఆదివారం రాత్రి మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా ఆధ్వర్యంలో నాయకులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఎరుకుల పాకలో గజరాయని వలస ఎంపిటిసి, రాష్ట్ర ఎస్‌టి సెల్ జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తెంటు రవిబాబు, వైస్ ఎంపిపి భాస్కర్ రావు తుదితరుల పాల్గొన్నారు.

ఎస్‌కోట: నిరసన తెలుపుతున్న గొంప కృష్ణ, తదితరులు

విజయనగరం: స్థానిక టిడిపి కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే మీసాల గీత ఆధ్వర్యంలో టిడిపి నాయకులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు

శృంగవరపు కోట: రాష్ట్ర ప్రభుత్వానికి కళ్ళు తెరిపిద్దామనే నినాదంతో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆయన నివాసం వద్ద కళ్ళు తెరిపిద్దాం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాయవరపు చంద్రశేఖర్, జుత్తాడ రామసత్యం, మాదిబోయిన మంగరాజు, ఆడారి ఉమామహేశ్వరరావు, గనివాడ సన్యాసినాయుడు, కోరుకొండ శ్రీనివాస్ రావు, మండా త్రినాధ్ తదితరులు పాల్గొన్నారు.